

ఎన్నికల నిర్వహణకు విభాగాల ఏర్పాటు

ఎన్నికల నోడల్ అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేసిన కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సగలి షన్మోహన్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సార్వత్రిక ఎన్నికలు– 2024కు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం నియమ నిబంధనలను అనుసరించి ఎన్నికల విధులను తూచా తప్పకుండా పాటించాలని జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్ తెలిపారు. సోమవారం డిఆర్‌డిఎ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులుతో కలసి జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు 2024 నిర్వహణకు ఏర్పాటు చేసిన విభాగాల నోడల్ అధికారులు, సంబంధిత సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేశారు. ఈసమావేశంలో డిఆర్ఓ బి.పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ ఎస్.షణ్మోహన్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలును సజావుగా నిర్వహించుటకు వివిధ విభాగాలను ఏర్పాటు చేసి నోడల్ అధికారులను, సిబ్బందికి కేటాయించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా మీడియా మేనేజ్మెంట్, ఎంసిఎంసి, సోషల్ మీడియా యూనిట్, కాంప్లెయింట్ రిడ్రసల్ సెల్, మానిటరింగ్ సెల్, 1950 కాల్ సెంటర్, ఎన్ఎస్‌జిపి యూనిట్, ఎంసిసి మానిటరింగ్ యూనిట్, రిక్వెస్ట్ అండ్ పర్మిషన్ మేనేజ్మెంట్ యూనిట్, రిపోర్ట్స్ మేనేజ్మెంట్ యూనిట్, హ్యూమన్ రిసోర్సెస్/ మ్యాన్ పవర్ మేనేజ్మెంట్ యూనిట్, ఎలాక్టోరల్ రోల్స్, ఎపిక్ కార్డ్స్ మేనేజ్మెంట్ యూనిట్, పోలింగ్ స్టేషన్స్ మేనేజ్మెంట్ యూనిట్, ట్రైనింగ్ మేనేజ్మెంట్ యూనిట్, బ్యాలట్ అండ్ పోస్టల్ బ్యాలట్ మేనేజ్మెంట్ యూనిట్, హోమ్ ఓటింగ్ ఫర్ ఆబ్సెంటీ వోటర్స్, మెటీరీయల్ ప్రొక్యూర్మెంట్ మేనేజ్మెంట్ యూనిట్, ట్రాన్స్ పోర్టేషన్ మేనేజ్మెంట్ యూనిట్, కమ్యూనికేషన్ మేనేజ్మెంట్ యూనిట్, అబ్జర్వర్ యూనిట్, ఎక్స్పెండిచర్ మానిటరింగ్ మేనేజ్మెంట్ యూనిట్, స్వీప్ మేనేజ్మెంట్ యూనిట్, లా అండ్ ఆర్డర్ మేనేజ్మెంట్ యూనిట్, ఈవిఎం మేనేజ్మెంట్ యూనిట్, నామినేషన్స్ మేనేజ్మెంట్ యూనిట్, పోల్ డే అరేంజ్మెంట్స్ యూనిట్, స్పెషల్ నీడ్స్ మేనేజ్మెంట్ యూనిట్ వంటి విభాగాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నోడల్ అధికారులు, తమకు కేటాయించిన సిబ్బంది ఎన్నికలు ముగిసే వరకు ప్రతి క్షణం అప్రమత్తంగా ఉంటూ విధులను నిర్వర్తించాలన్నారు. ప్రతి విభాగంలోని నోడల్ అధికారి, వారి సిబ్బందికి ఎన్నికల కోడ్ సమయంలో నిర్వర్తించవలసిన విధులను వివరించారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన వివిధ విభాగాల ఎన్నికల నోడల్ అధికారులు సమన్వయం చేసుకుంటూ నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటైన సంబంధిత విభాగాల సిబ్బందితో సమన్వయం చేసుకుని విధులు నిర్వర్తించవలసి ఉంటుందని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి తీసుకోవలసిన చర్యలు, రిపోర్ట్‌ల తయారీ వంటివి నిర్దేశిత కాలంలో పంపవలసి ఉంటుందని తెలిపారు.

ఎన్నికల విధుల హ్యాండ్ బుక్‌పై అవగాహన ఉండాలి: కలెక్టర్

గంగాధరనెల్లూరు: ఎన్నికల విధుల నిర్వహణ హ్యాండ్ బుక్‌పై అధికారులు అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ షన్మోహన్ సూచించారు. సోమవారం జీడీనెల్లూరు తహశీల్దార్ కార్యాలయంలో 2024 సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నియోజకవర్గంకి సంబంధించి నామినేషన్ల ప్రక్రియ, పోస్టల్ బ్యాలెట్, ఎంసీసీ, ఎలక్షన్స్ వ్యయం, ఎస్ఎస్‌టి, ఎఫ్ఎస్‌టి, విఎస్‌టి, వివిటి, అకౌంట్స్, ఫిర్యాదులు, రిపోర్ట్స్, రవాణా, పోలింగ్, మేనేజ్మెంట్ వంటి టీమ్స్‌లోని అధికారులు ఎలక్షన్స్‌లో నిర్వహించవలసిన బాధ్యతలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో జెసీ శ్రీనివాసులు, నియోజకవర్గ ఆర్‌వో వెంకటశివ, తహశీల్దార్ రవి, డీటీ విజయకష్ణ, ఏఎస్‌వో ఆనందమోహన్, పలువురు తహశీల్దార్లు, ఎంపిడివోలు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

అటకెక్కిన అమృత్...

- కలగానే మిగిలిన ఇంటింటికీ నీటి సరఫరా
- శంకుస్థాపనకే పరిమితమైన హామీ...
- తీరని నగరవాసుల తాగునీటి కష్టాలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

చిత్తూరు నగరంలోని ఇంటింటికీ సురక్షిత మంచినీటి సరఫరా కళగానే మిగిలింది. నగరవాసుల తాగునీటి కష్టాలు తీర్చేలా గత ఏడాది సెప్టెంబర్ 9వ తేదీ స్థానిక కైలాసపురం వద్ద భారీగా ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణానికి నగర పాలక సంస్థ అమృత్ పథకం క్రింద రూ.29.20 కోట్లతో ఓవర్ హెడ ట్యాంకుల నిర్మాణానికి ప్రజాప్రతినిధులు, అధికారులు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ టెండర్ హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైవేట్ కంపెనీ దక్కించుకుంది. వెంటనే పనులు ప్రారంభించి దాదాపు ఆరు నెలల పాటు ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణాన్ని చేపట్టింది. అయితే ప్రభుత్వం నుంచి బిల్లులు అందకపోవడంతో పనులు అర్ధాంతరంగా ట్యాంకు నిర్మాణం ఆగిపోయింది. అమృత్ పథకం నిధులతో చిత్తూరు నగర వాసులు శాశ్వత సురక్షిత తాగునీటిని అందించేందుకు అడవిపల్లి రిజర్వాయర్ నుంచి పైపులైన్ల ద్వారా కైలాసపురం వద్ద నిర్మించే ఓవర్ హెడ్ ట్యాంకులను నీటిని తరలించి అక్కడి నుంచి నగరంలోని ఇంటింటికీ సురక్షిత తాగునీటిని సరఫరా చేయాలన్నదే ఈ పథకం ముఖ్యఉద్యేశం అయితే ట్యాంకు నిర్మాణం మాత్రం అర్ధాంతరంగా ఆగిపోయింది. టెండర్ తీసుకున్న కంపెనీకి నిధులు రాకపోవడంతో ఆపేసినట్లు కొందరు చెబుతున్నారు.

ఇంటింటికీ సురక్షిత తాగునీరు కలేనా...

చిత్తూరు అనగానే గుర్తుకు వచ్చే సమస్య తాగునీటి సమస్య... ప్రస్తుతం వేసవి కాలం సమీపించడంతో నగరంలో తాగునీటి ఎద్దడి నెలకొంది. దీంతో ప్రైవేట్ నీటి సరఫరా ట్యాంకర్లకు గిరాకీ బాగా పెరింది. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకున్న ప్రైవేట్ నీటి సరఫరా ట్యాంకర్ల యజమానులు ట్యాంకరు నీటికి రూ.400 నుంచి 600ల వరకు తీసుకుంటున్నారు. ఒక్క చిత్తూరు నగరంలోనే నీటి వ్యాపారం కోట్లల్లో జరుగుతోంది. ప్రభుత్వాలు మారినా... పాలకులు మారినా.. చిత్తూరు వాసుల తాగునీటి సమస్యకు మాత్రం పరిష్కారం చూపలేకపోయారు. ప్రతి సంవత్సరం వేసవిలో నగరవాసులు నీటి కష్టాలను ఎదుర్కోక తప్పడం లేదు. నగరంలో రెండు లక్షలకు పైగా ఉన్న జనాభాకు ఏకైక నీటి సరఫరా పూనేపల్లి వద్ద ఎన్‌టిఆర్ జలాశయం మాత్రమే.. ఇతర మార్గాలు లేవు.. కొందరు బోర్ల ద్వారా నీటిని వాడుకుంటున్నా అవి మరమ్మతులకు గురైనా, భూగర్భజనాలు అడుగంటినా ఇక వారి నీటి కష్టాలు వర్ణణాతీతం. వేసవి ప్రారంభానికి ముందే నగరంలో నీటి కష్టాలు ఇలా ఉంటే.. ఇక నడి వేసవిలో పరిస్థితి ఏమిటని ప్రజలకు ఆందోళన చెందుతున్నారు.



శాశ్వత తాగునీటి కోసం కైలాసపురం వద్ద
రూ. 29.20 లక్షతో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం శిలాఫలకం

సురక్షిత నీటి సరఫరా పథకం ఎందుకు ఆగింది..

రూ. 29.20లక్షలతో చేపట్టిన అమృత్ పథకం అర్ధాంతరంగా ఆగిపోయింది. ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం ఏడాదిలోపు పూర్తి చేస్తామని నగర పాలక సంస్థ ప్రకటించి ఏడాది కావస్తోంది. ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం కోసం బెస్‌మెంట్ వేసి నిర్మాణ పనులు ఆపేశారు. సురక్షిత తాగునీటిని అందిస్తారని ఆశించిన నగరవాసులు ఆశలపై నీళ్లు చల్లారు. శాశ్వత తాగునీటి సరఫరా పథకం ఆగిపోవడంతో కారణాలు ఎవర్ని అడగాలో తెలియక సతమతమౌతున్నారు. కారణాలు ఏమైనప్పటికీ చిత్తూరుకు శాశ్వత తాగునీటిని అందించాలని నగర వాసులు కోతున్నారు.



ఆగిన ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం

మహిళలే మహారాణులు..

డిఆర్‌డిఎ పీడీ తులసి



స్వయం సహాయ సంఘాలకు మెగా చెక్కును అందజేస్తున్న పిడి తులసి

ప్రజాశక్తి- చిత్తూరు: మహిళలే మహారాణులని చిత్తూరు డిఆర్‌డిఎ పిడి తులసి అన్నారు. సోమవారం జిల్లా సచివాలయంలో జరిగిన ప్రధానమంత్రి వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి పీడీతోపాటు స్వయం సహాయక సంఘ సభ్యులు హాజరై కార్యక్రమాన్ని వీక్షించారు. పిడి మాట్లాడుతూ స్వయం సహాయ సంఘాలు ఏర్పాటుతో మహిళల్లో ఆర్థిక సామాజికపరంగా చైతన్యం వచ్చిందన్నారు. సంఘాల ద్వారా ప్రతి కుటుంబానికి కొంతవరకు ఆర్థిక భరోసా కలిగిందన్నారు. స్వయం సహాయక సంఘ సభ్యులను లక్షాధికారులు చేయాలన్న సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. అర్హులైన సంఘ సభ్యులు ఈ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా పురోగతిని సాధించాలన్నారు. ప్రభుత్వాలు చేపట్టే పథకాల పట్ల సంఘ సభ్యులు సంపూర్ణ పరిజ్ఞానం కలిగి ఉండాలని అప్పుడే ఎంచుకున్న ఉపాధి మార్గాలు సత్‌ఫలితాలు ఇస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా లక్ పతి దీదీ కార్యక్రమంలో బాగా జిల్లాలోని 1419 స్వయం సహాయ సంఘ సభ్యులకు రూ.150.41 కోట్లలను చెక్ రూపంలో అందజేశారు. అలాగే పలు స్వయం సహాయక సంఘంలో స్థిరమైన జీవనోపాధులను ఎంచుకుని ఆర్థికంగా స్థిరపడిన పలువురు సంఘ సభ్యులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపిఎం వెంకటేష్, ఏపీఎంలు సూరి, నాగేశ్వరరావు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సుకన్య, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

14, 15 తేదీల్లో తేనె టీగల పెంపకంపై

రాష్ట్ర స్థాయి సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్: జాతీయ తేనె టీగల పెంపకం, తేనె మిషన్ పథకం లో భాగంగా ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల జాతీయ సంస్థ సంయుక్తంగా విద్యార్థులకు, గ్రామీణ యువతకు, మహిళలకు, ఔత్సాహికులకు తేనె టీగల పెంపకం పై రెండు రోజుల రాష్ట్ర స్థాయి సదస్సు ఈ నెల 14 మరియు 15 తేదీలలో నిర్వహించనున్నట్లు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ పరిశోధనా సంచాలకులు డా.సి.రమణ తెలిపారు. తేనెటీగల పెంపకం పరిశ్రమను ప్రోత్సహించడం కొరకు నిర్వహిస్తున్న ఈ సెమినార్ లో తేనె టీగల పెంపకంలో మెళకువలు, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్ అవకాశాలు, వివిధ విలువ ఆధారిత ఉత్పత్తులు వంటి విషయాలపై అవగాహన కల్పించడమే గాక తేనెటీగల పెంపకంలో నిష్ణాతులైన రైతుల అనుభవాలు పంచుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు.

బాలుని కిడ్నాప్ కథ సుఖాంతం

తల్లిదండ్రులకు అప్పగించిన ఎస్‌పి



ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుమలలో ఆదివారం కిడ్నాప్‌కు గురైన బాలుడు అభినయ్ (3) కేసును పోలీసులు మూడు గంటల్లోనే ఛేదించి బాలుని తల్లిదండ్రులకు అప్పగించి శభాష్ అనిపించుకున్నారు. ఈ ఘటన సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ కష్ణ కాంత్ పటేల్ సోమవారం మీడియాకు వివరించారు. స్థానిక పోలీస్ గెస్ట్ హౌస్ లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్రం గద్వాల జిల్లా నుంచి శ్రీవారి దర్శనార్థం కుటుంబ సభ్యులు 10 మంది కలసి తిరుమలకు కాలినడకన ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు చేరుకున్నారు. మగవారు రూముల రిజిస్ట్రేషన్‌కు వెళ్లగా, ఆడవారు నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని మహిళ పిల్లవానికి సెల్‌ఫోన్ ఇచ్చి ఏమార్చి కిడ్నాప్ చేసింది. ఎస్‌పి ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సిసిటివి ఫుటేజీలను పరిశీలించగా తిరుపతి పెద్దకాపు లేఔట్‌లోని ఓ లాడ్జిలో బాలునితో ఉన్నట్లు గుర్తించి వెంటనే అదుపులోకి తీసుకున్నారు. బాలుని తల్లిదండ్రులకు అప్పగించారు. పిల్లలు లేకపోవడం వల్ల బాలుని అపహరించినట్లు నిందితురాలు పేర్కొంది. నిందితురాలు రాజమండ్రివాసిగా గుర్తించారు. బాలున్ని పట్టుకునేందుకు విశేష కృషి చేసిన సిఐలు జగన్ మోహన్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, రిపేటర్, బ్లూ–కోల్ట్స్, రక్షక్ స్టాఫ్ వారిని, సమాచారం ఇచ్చిన ఉద్యోగి ఆవుల ప్రభాకర్ యాదవ్‌ను జిల్లా ఎస్పి ప్రత్యేకంగా అభినందించారు.

నిబంధనల ప్రకారం ఓటరు దరఖాస్తుల పరిష్కారం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఓటరు దరఖాస్తులను పరిష్కరించాలని ఆర్డీవో చిన్నయ్య, ఏఈఆర్వో కమిషనర్ డాక్టర్ జె.అరుణ చెప్పారు. ఓటరు దరఖాస్తుల పరిశీలన, పరిష్కారం అంశాలపై బిఎల్‌ఓలతో సోమవారం నగరపాలక కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఆర్ఓ, కమిషనర్ మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల పరిధిలో పెండింగ్లో ఉన్న ఫారం– 6, 7, 8, 8ఎ దరఖాస్తులను సత్వరం పూర్తి చేయాలన్నారు. దరఖాస్తుల ఆమోదం, తిరస్కరణకు సంబంధించి అనుబంధ డాక్యుమెంట్లను కచ్చితంగా పొందుపరచాలని మొత్తం దరఖాస్తులు, సంబంధిత ధృవపత్రాలను ఒకటిగా ఫైల్ చేయాలన్నారు. దరఖాస్తుల పరిశీలనలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరబాట్లకు తావు లేకుండా చూడాలన్నారు. తప్పులు లేని తుది ఓటర్ల జాబితా తయారీ కోసం జాగ్రత్తగా విధులు నిర్వహించాలన్నారు. సూపర్వైజర్ ఆఫీసర్లు వారి పరిధిలోని బిఎల్వోలను సమన్వయం చేసుకొని దరఖాస్తుల ప్రక్రియ సక్రమంగా, సవ్యంగా జరిగేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఎంఎం గోపి, సూపర్వైజర్ అధికారులు, బిఎల్వోలు పాల్గొన్నారు.



ఓటర్ల వెరిఫికేషన్ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నయ్య

మహిళల పట్ల పాలకుల వైఖరి మారాలి

సభలో మాట్లాడుతున్న యుటిఎఫ్ సహాధ్యక్షులు రెహనా బేగం



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మహిళ అనే వివక్ష రాష్ట్రపతి నుండి వంటగది దాక ఉంటుందని, మహిళలు రాష్ట్రపతి అయిన నూతన పార్లమెంట్ ప్రారంభోత్సవానికి అయోధ్య రామాలయం ప్రారంభోత్సవానికి కానీ పిలువలేదని, భారతదేశం తరపున ఒలంపిక్స్‌లో పాల్గొని బంగారు పతకాలు తెచ్చిన వారి మీద రెజ్లింగ్ కమిటీ అధ్యక్షుడి అత్యాచారం ఆగలేదని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సరిత, సహాధ్యక్షులు రెహనా బేగం అన్నారు. సోమవారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో మహిళా దినోత్సవ కార్యక్రమం యుటిఎఫ్ కార్యవర్గ సభ్యులు దీనావతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బేటి బచావో.. బేటి పడావో పేరుతో కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పుకుంటూనే మహిళలపై హింసకు పూనుకుంటున్నాయని ఆరోపించారు. మణిపూర్‌లో మహిళల్ని అత్యంత దారుణంగా నగ్నంగా ఊరేగించినా ప్రధాన మోడీ పెదవి విప్పకపోవడం, దోషులను శిక్షించకపోవడం చూస్తే వీరికి మహిళ పట్ల ఎంతటి గౌరవం ఉందో అర్థమవుతోందని విమర్శించారు. ఇకనైనా మహిళలను చులకనగా చూసే వైఖరి మారాలని హితవు పలికారు. మాజీ ప్రధానోపాధ్యాయులు మీనా కుమారి, ఐద్వా నాయకురాలు భువనేశ్వరి, సిఐటియు నాయకులు షకీలా బేగం, సుజని, లీలావతి, రేవతి, రోజా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవి రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.మణి గండన్, జిల్లా కార్యదర్శులు రెడ్డెప్ప నాయుడు, ఎస్‌పి బాషా, ఏకాంబరం, పార్థసారధి, సురేష్, గణేష్ కుమార్ పాల్గొన్నారు.

స్విమ్స్‌లో 479 నర్సు పోస్టుల భర్తీ

టిటిడి పాలకమండలి నిర్ణయాలు



ప్రజాశక్తి - తిరుమల: స్విమ్స్ ఆస్పత్రిలో 479 నర్సు పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించినట్లు టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి వెల్లడించారు. తిరుమల అన్నమయ్య భవన్‌లో టిటిడి ధర్మకర్తల మండలి సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా నిర్ణయాలను ఆయన మీడియాకు వెల్లడించారు. టిటిడిలోని అన్ని కళాశాలల్లో సిఫార్సు లేకుండానే విద్యార్థులకు హాస్టల్ వసతి కోసం అదనంగా భవనాలు నిర్మించాలని నిర్ణయించారు. 2014కు ముందు టిటిడిలో నియమించిన కాంట్రాక్టు పొరుగు సేవా సిబ్బందిని రెగ్యులరైజ్ చేసేందుకు ప్రభుత్వానికి సిఫార్సు చేసినట్లు తెలిపారు. యాత్రా సముదాయంలో లిఫ్ట్‌ల ఏర్పాటుకు 1.88 కోట్లు కేటాయించారు. బాలాజీనగర్ సమీపంలో ఫెన్సింగ్ ఏర్పాటుకు నిర్ణయించారు. 14 కోట్లతో టిటిడిలోని 188 క్వార్టర్స్ ఆధునీకరణ చేయనున్నారు. గోవిందరాజస్వామి ఆలయంలో బాష్యకార్ల సన్నిధిలో మకర తోరణం బంగారు తాపడానికి ఆమోదించారు. ఐటి సేవల కోసం రూ.12 కోట్లు కేటాయించారు. శ్రీవాని ట్రస్టు నిధులతో టిటిడిలోని పురాతన ఆలయాల మరమ్మతుకు ఆమోదించారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన శ్రీవారి ఆలయ ఉద్యోగి నరసింహన్ కుటుంబానికి రూ.5 లక్షలు పరిహారం ఇవ్వాలని తీర్మానించారు.

టిటిడి మాజీ బోర్డు సభ్యులు పదేపదే రావొద్దు

టిటిడి ధర్మకర్తల మండలి మాజీ సభ్యులకు సంవత్సరంలో కొన్నిసార్లు మాత్రమే వారి కుటుంబ సభ్యులతో (భార్యా పిల్లలతో) శ్రీవారి దర్శనం చేసుకునే అవకాశాన్ని బోర్డు కల్పించిందని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, కుటుంబ సభ్యులతో కాకుండా ఇతరులను వెంట బెట్టుకుని పదేపదే తిరుమలకు రావడం మంచి పద్ధతి కాదన్నారు. మాజీ బోర్డు సభ్యుని హోదాలో కేవలం కుటుంబ సభ్యులతో మాత్రమే శ్రీవారి దర్శనానికి రావాలే తప్ప, ఇతరులను వెంట బెట్టుకుని వస్తే ఎటువంటి పరిస్థితుల్లోనూ శ్రీవారి దర్శనానికి అనుమతించేది లేదన్నారు.

మరో మెట్టు ఎదిగిన నగరి కీర్తి

నగరిలో ఆర్టీవో కార్యాలయం ప్రారంభించిన మంత్రి
ఇక నగరిలోనే ఎల్ఎల్ఆర్‌లు, లైసెన్సులు, ఎఫ్‌సీలు



ప్రజాశక్తి- నగరి: నగరి కీర్తికి మరో మెట్టు ఎదిగేలా చేసే ఆర్టీవో కార్యాలయం నగరి పట్టణంలో ప్రారంభమైంది. సోమవారం మున్సిపల్ పరిధి రాజీవ్‌నగర్ సమీపం ఎస్‌కేఎన్ కాంపౌండ్‌లో ఏర్పాటు చేసిన మోటారు వాహన తనిఖీ అధికారి కార్యాలయాన్ని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నగరి, నిండ్ర, విజయపురం, కార్వేటి నగరం, వెదురుకుప్పం, పాలసముద్రం మండలాలకు చెందిన వాహనదారులు ఇదివరలో లైసెన్సులు పొందాలన్నా, రిజిస్ట్రేషన్లు చేసుకోవాలన్న, ఎఫ్‌సీ పొందాలన్నా చిత్తూరుకు వెళ్లాల్సి ఉండేది అన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికంగా ఉన్న వాహనదారులు, ఆటో, టాక్సీ డ్రైవర్లు తన దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. నగరిని డివిజన్‌గా మార్చి ఆర్డీవో కార్యాలయం, డీఎస్పీ కార్యాలయం, ఆర్టీవో కార్యాలయం తీసుకురావడం జరిగిందన్నారు. డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టీవో కార్యాలయం నగరికి తీసుకురావడానికి మంత్రి ఆర్కేరోజా చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. నగరిలో ఏర్పాటుచేసిన కార్యాలయం ద్వారా ఎల్ఎల్ఆర్, డీఎల్, ఎఫ్‌సీ, రిజిస్టేషన్ రెన్యువల్, డ్రైవింగ్ లైసెన్సు రెన్యువల్, ఇంటర్నేషనల్ డ్రైవింగ్ లైసెన్సు, డ్రైవింగ్ లైసెన్స్ అడ్రస్ మార్పు లాంటివి నగరిలోనే చేసుకోవచ్చున్నారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరమగ్గ కార్మికులకు కూలి రేట్లు పెంచాలి

ఆర్‌డిఓకు సిఐటియు నేతల వినతి



ఆర్డీవోకు వినతి పత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- నగరి: నగరి నియోజకవర్గంలోని మరమగ్గ కార్మికులు 2022లో చేసిన పోరాటాల ఫలితంగా జరిగిన చర్చలలో మాస్టర్ వీవర్లు మరమగ్గ కార్మికులకు ఒక మీటర్‌కి రూ.2.50లు కూలి రేట్లు పెంచుతామని ఇచ్చిన హామీని ఇప్పటి వరకు నెరవేర్చ లేదని మరమగ్గ కార్మికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పెరుమాళ్ తెలిపారు. సోమవారం చర్చలో తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ నగరి ఆర్‌డిఓ, మున్సిపల్ ఛైర్మన్ నీలమేఘంకు వినతిపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నగరి నియోజకవర్గంలో దాదాపు 10వేల కుటుంబాలు మరమగ్గాలను నమ్ముకుని జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. గతలంలో తమ సమస్యల పరిష్కారం కోసం పలు పోరాటాలు, ఉద్యమాలు చేసినప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా లేబర్ కమిషన్ అధికారులు, జిల్లా కలెక్టర్ స్పందించి గత చర్చల్లో మరమగ్గ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సిఐటియు నాయకులు జగదీష్, షన్ముఘం, గణపతి, విశ్వనాథన్, మురగేసన్, విజయమణి పాల్గొన్నారు.

ఎస్‌విఎంసి, రుయాను

సందర్శించిన వైద్య విద్య సంచాలకులు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఎస్‌వి వైద్య కళాశాల, రుయా ఆసుపత్రి ని డైరెక్టర్ ఆఫ్ వైద్య విద్య సంచాలకులు డాక్టర్ నరసింహన్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ స్వాగతం పలికారు. ఎస్వీ వైద్య కళాశాల భువన విజయం ఆడిటోరియంలో , చెవి ముక్కు, నాలుక విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ వినకడి దినం ముగింపు సమావేశాలు సందర్భంగా ఎగ్జిబిషన్‌ను ప్రదర్శించారు. వినికిడి సామగ్రిలు అవగాహన కొరకు మొట్టమొదటిసారిగా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు.డాక్టర్ నరసింహన్ ఈ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. అనంతరం సామాజిక వైద్య వైద్య విభాగంలో ఆగస్టు నెలలో జరగబోవు ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్, ఇండియన్ సోషల్ ప్రివెంటివ్ మెడిసిన్, వారి మూడు రోజుల కాన్ఫరెన్స్ బ్రోచర్ను ఆవిష్కరించారు. ఎస్ వి వైద్య కళాశాల పిఆర్ఓ వీర కిరణ్ పాల్గొన్నారు.

కంటి చికిత్సకు 34 మంది ఎంపిక


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: చెన్నై శంకర్ నేత్రాలయ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు 55మందికి కంటి పరీక్షలు చేయగా వారిలో 34మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. కాగా వారికి ఉచితంగా శాస్త్ర చికిత్సలు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అందుకు ఉచితంగా ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు వారు వివరించారు.

ఆశీర్వదించండి: ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-వి.కోట: ఇన్నాళ్లూ చేసిన అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని ఎమ్మెల్యే వెంకటేగౌడ విజ్ఞప్తి చేశారు. సోమవారం మండలంలోని పాముగానిపల్లి పంచాయతీలో వైసీపీ నాయకులతో సామవేశం నిర్వహించి మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో మరో అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తామని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజ్, నాయకులు బాల గురునాథ్, తమీమ్ ఖాన్, లక్ష్మణ్ రెడ్డి, నాగరాజు, శ్రీరాములు రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నా దేశం కోసం.. నా ఓటు

ప్రజాశక్తి-కార్వేటినగరం: కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విభాగము ఆధ్వర్యంలో "మేరా బహలా వోట్ దేశ్ కేలియే" అనే ఓటర్ల అవగాహన కార్యక్రమాలను విభిన్న రూపాలలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విజయులు రెడ్డి మాట్లాడుతూ ప్రలోభాలకు లోనవ్వకుండా దేశ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ధనంజయరెడ్డి విద్యార్థులకు ఓటర్ హెల్ప్ లైన్ యాప్ గురించి, ఓటింగ్ జరిగే విధానం గురించి, ఓటరుగా ఎలా నమోదు కావాలి, ఎపిక్ కార్డును ఎలా డౌన్లోడ్ చేసుకోవాలి మొదలగు అంశాలను డిజిటల్ స్క్రీన్ ద్వారా చక్కగా వివరించారు. తర్వాత విద్యార్థుల చేత భారత పౌరులమైన మేము, ప్రజాస్వామ్యంపై అఖండ విశ్వాసం కలిగి, మన దేశ ప్రజాస్వామ్య సంప్రదాయాలను, స్వేచ్ఛా, న్యాయమైన, శాంతియుత ఎన్నికల గౌరవాన్ని నిలబెట్టుకుంటామని, ప్రతి ఎన్నికలలో నిర్భయంగా మతం, జాతి, కులం, వర్గం, భాష లేదా ఎలాంటి ప్రేరేపణలకు గురికాకుండా లొంగకుండా నిజాయితీగా, నా దేశ మంచి భవిష్యత్తు కోసం ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సీ.ఎన్ లత, డాక్టర్ సుబ్బారావు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి: జెడ్పీ చైర్మన్


అధికారులతో సమీక్షిస్తున్న జెడ్పీ చైర్మన్

ప్రజాశక్తి-వికోట: వేసవిలో తలెత్తే తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం స్థానిక మండల కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. హౌసింగ్, ఉపాధిహామీ, డ్వాక్రా, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులతో సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న ప్రజాప్రతినిధులతో మాట్లాడి ఆయా గ్రామాల్లో ఉన్న ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ఆ సమస్యల పరిష్కారానికి అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై అక్కడికక్కడే ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో అశోక్‌రెడ్డి, వికోట ఈవో యాదవపతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు


ఏర్పాటు చేసిన వీధి దీపాలు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని కందూరు పంచాయతీలో నూతన విద్యుత్ స్తంభాలకు వీధి దీపాలను ఏర్పాటు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి జయశంకర్ తెలిపారు. ఇటీవల విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నూతన విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేశారన్నారు. వాటికి నూతనంగా వీధి దీపాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

లక్ష్మీనారాయణకు సన్మానం


లక్ష్మీనారాయణ దంపతులను సన్మానిస్తున్న పలువురు

ప్రజాశక్తి-యాదమరి: మండలంలో గత 34 సంవత్సరాలుగా 184గొల్లపల్లిలో ఎందరో విద్యార్థిని విద్యార్థులను అత్యున్నత స్థానానికి బాటలు వేసిన లక్ష్మీనారాయణను పలువురు ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు, ప్రజలు పాల్గొని సన్మానించారు. ఆయన దంపతులను చందన, పుష్ప తాంబూలాలతో సత్కరించారు.

గ్రామాభివృద్ధే ధ్యేయం: ఎంపీపీ


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ

ప్రజాశక్తి-కార్వేటినగరం: గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గొల్లచెంగమ్మ వీధిలో సర్పంచ్ ధనంజయవర్మ ఆధ్వర్యంలో సుమారు 7.50లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా డిప్యూటీ సీఎం నారాయణస్వామి చొరవతో అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయని గుర్తుచేశారు. ధనశేఖర్‌వర్మ, అంభిక, రవియాదవ్, ధనంజయుడు, రాజు, మురళీ, జేజేలురెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని ప్రభుత్వ భూములు కొంత మంది ఆక్రమించుకొని రూ.లక్షలు గడిస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షులు సోమశేఖర్‌గౌడ్ ఆరోపించారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో మండల నాయకులతో కలిసి ఆర్డీఓకి వినతి పత్రం అందించినట్లు వారు తెలియజేశారు. గంగవరం పట్టణానికి సమీపంలో ఉండటంతో లక్షల రూపాయలు ఈ నేపథ్యంలో ప్రభుత్వం రాత్రికి రాత్రే కంచెలు వేయడం, నకిలీ పత్రాలు సృష్టించి అమ్ముకోవడం జరుగుతుందన్నారు. ఆర్డీవో స్పందించి అలాంటి భూములను గుర్తిస్తామని ఎలాంటివారైనా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ భూములను కేవలం ప్రభుత్వ కార్యాలయాలకు ఉపయోగించాలని అన్నారు.

ఆలయానికి విరాళం


విరాళాన్ని అందిస్తున్న డాక్టర్ థామస్

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని బొమ్మయిపల్లి పంచాయతీ దేవళంపేట గ్రామంలో రామాలయ పునర్నిర్మాణానికి టీడీపీ జీడీ నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ విరాళాన్ని అందజేశారు. ఆలయ ధర్మకర్త సుకుమార్‌కి రూ.25వేల నగదును అందించారు. కార్యక్రమంలో కిషన్‌చంద్, మునస్వామి, గోపిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

పేద వర్గాల అభ్యున్నతికి టీడీపీ కృషి: ఎమ్మెల్సీ


ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-రామకుప్పం: పేద వర్గాల అభ్యున్నతికి టీడీపీ కృషి చేస్తుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. సోమవారం 89 పెద్దూరులో రైతు చైతన్య యాత్ర, ఇంటింటికి టీడిపి, శంఖారావం, సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. టిడిపి అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా బలపడేలా చేస్తామన్నారు. మహిళలకు, విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తామన్నారు. కుప్పం నియోజకవర్గంలో 35ఏళ్లుగా అభివృద్ధిని శరవేగంగా చేపట్టిన చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో అండగా నిలిచి, లక్ష మెజారిటీతో ఘన విజయం చేకూర్చాలని కోరారు. ఈ సందర్భంగా పెద్దూరుకు చెందిన వైసీపి నేత టమోటా సీనప్ప టీడిపిలో చేరగా ఆయనకు టీడిపి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమాల్లో మునస్వామి, మనోహర్, ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, చిన్నికృష్ణ, చలపతి, నరసింహులు, నారాయణ, రామమూర్తి, సుబ్రీ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం: డిప్యూటీ సీఎం



జీడీ నెల్లూరులో మెగా చెక్కును అందజేస్తున్న డిప్యూటీ సీఎం

ప్రజాశక్తి-కార్వేటినగరం: మహిళల సంక్షేమం, ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎంపీపీ లతబాలాజీ, సర్పంచ్ ధనంజయవర్మ ఆధ్వర్యంలో 'వైఎస్సార్ చేయూత' కార్యక్రమాన్ని నిర్వహించారు. రూ.5.25కోట్ల మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆర్‌కేవీబీపేటలో సుమారు రూ.38లక్షలతో నిర్మించిన అభివృద్ధి పనులను డిప్యూటీ సీఎం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్రాజు, గోపినాథ్, గోపి, మాజీ క్రిష్ణయాదవ్, విశ్వనాథరెడ్డి, ఎంపీడీవో సుధాకర్నాయుడు, ఏపీఎం విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీడీ నెల్లూరు సభలో కంటతడి

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: జీడీ నెల్లూరులో నిర్వహించిన వైఎస్సార్ చేయూత కార్యక్రమంలో నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త కృపాలక్ష్మి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి భావోద్వేగానికి లోనై కంటతడి పెట్టుకున్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీలు కలిసి పోటీ చేసేందుకు సిద్ధమయ్యారని, అయితే సీఎం జగన్ మోహన్ రెడ్డి ఒంటరిగానే పోటీ పడేందుకు సిద్ధమయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిత, సింగిల్ విండో త్రీమెన్ కమిటి చైర్మన్ వేల్కూర్ బాబు రెడ్డి, మండల వైసీపీ కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిన్నమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంకి క్షీరాభిషేకం



ప్రజాశక్తి-పూతలపట్టు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్ కుమార్, జడ్పిటిసి, డ్వాక్రా మహిళలు క్షీరాభిషేకం నిర్వహించారు. 45 సంవత్సరాలు నిండిన మహిళలకు ప్రభుత్వం అందించిన ఆసరా పథకానికి సంబంధించి ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ మహిళలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందింది వైసీపీ ప్రభుత్వంలోనే అని చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీలకు కట్టుబడి చెప్పిన అభివృద్ధి చేశాం: రోజా



ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: పట్టణ ప్రజలకు అత్యాధునిక క్రిమేషన్ షెడ్డును అందుబాటులోకి తెస్తున్నట్టు మంత్రి రోజా తెలిపారు. రూ.1.09కోట్ల నిధులతో స్మశాన వాటికలో మౌలిక వసతులు కల్పించి నగరి పట్టణం కుశస్థలి నది ఒడ్డున సిద్ధం చేసిన కాశీ విశ్వేశ్వర వైకుంఠ ముక్తిదామాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. తన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వైకుంఠ ముక్తిదామం ప్రవేశ మార్గంలో ఏర్పాటుచేసిన పది అడుగుల ఎత్తున్న మహాశివుని విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ సమస్యలకు నెలవుగా ఉన్న నగరి స్మశాన వాటికను ఆధునికీకరించేందుకు ప్రత్యేక పథక రచన చేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా స్మశానంలో ఎల్పిజి క్రిమేషన్ షెడ్డు, ఉత్తర క్రియలు జరిపే గదులు, బాత్రూం లు, స్మశానం లోపలికి వెళ్లడానికి రోడ్డు, ప్రవేశ మార్గంలో ఆర్చి అంటూ ఆధునిక స్మశానాన్ని సిద్ధం చేయడం జరిగిందన్నారు.

పోలీసుల కవాతు


పూతలపట్టులో కవాతు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-పూతలపట్టు: త్వరలో జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం పూతలపట్టు మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. సమస్యాత్మక గ్రామాలైన గొడుగు చింత, ఎం.బండపల్లి, వావిల్‌తోట, పి.కొత్తకోట, పూతలపట్టు గ్రామాల్లో ప్రత్యేక పోలీసు సిబ్బందితో సీఐ సుదర్శన ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బంగారుపాళ్యం: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలని సిఐ లక్ష్మయ్య అన్నారు. సోమవారం బిఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండర్ వివేక్ బద్దూరియా ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. పోలీస్ స్టేషన్ నుండి బంగారుపాలెం పురవీధుల్లో రాగిమాను పెంట రోడ్డు వరకు అనంతరం తహశీల్దార్ కార్యాలయం వరకు కవాతు జరిగింది. కార్యక్రమంలో ఎస్ఐ మల్లికార్జున్, ఏఎస్ఐ మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కేంద్రబలగాలు, పోలీసు బలగాలతో కలసి కార్వేటినగరం వీధుల్లో సోమవారం కవాతు ప్రదర్శన నిర్వహించినట్లు నగరి డీఎస్పీ కే.ఎస్ మూర్తి తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్పీ కమాండర్ దీపంకర్ వర్మ, ట్రైనీ డీఎస్పీ పావన్కుమార్, సీఐ సత్యబాబు, ఎస్ఐ వెంకటకృష్ణ, ఏఎస్ఐ మునికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మహిళ దినోత్సవం


సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-యాదమరి: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం కె.గొల్లపల్లి ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్. కం. హెచ్. యం ఎ.పి.లలిత మాట్లాడుతూ కె.గొల్లపల్లె పాఠశాలలో పురుష ఉపాధ్యాయులు అందరు స్నేహ, సోదర భావంతో కలసి మెలసి ఒక్కటిగా పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీచర్స్ కనకాచారి, మురళీధరన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ప్రోత్సాహకం అందజేత


విద్యార్థికి బహుమతి ప్రదానం చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-యాదమరి: గత ఏడాది 10వ తరగతిలో అత్యుత్తమ ఫలితాలు కనబరచి టాపర్‌గా నిలిచిన విద్యార్థి షీజకు ఉపాధ్యాయులు బహుమతులు ప్రదానం చేశారు. సోమవారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి ఉపాధ్యాయులు కృష్ణారెడి స్వీట్లు, రూ.18వేల నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గిరిరాజ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి


ఆందోళన వ్యక్తం చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: తాగునీటి సమస్యను పరిష్కరించాలని మండలంలోని నెల్లిపట్ల పంచాయతీ పరిధిలోని ఓటేరిపాళ్యం మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. 60కుటుంబాలు ఉంటున్న గ్రామంలో నీటి సమస్య ఏర్పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ఎవరూ పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులైనా స్పందించి తగు చర్యలు చేపట్టాలని వారు కోరారు.

లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ


బైరెడ్డిపల్లిలో పట్టాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

ప్రజాశక్తి-సోమల: సోమల పంచాయతీ పరిధిలోని పలువురు నిరుపేదలకు జగనన్న లేఅవుట్‌లో ఇంటి స్థలాలు పొందిన లబ్ధిదారులకు సోమవారం రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాలను అందజేశారు. అర్హులైన వారికి పంపిణీ చేసినట్టు పంచాయతీ కార్యదర్శి సుధాకర్ తెలిపారు. ప్రభుత్వం ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేసి లబ్ధిదారులకు అందజేయడం హర్షించదగ్గ విషయమని ఇంటి పట్టా పొందిన శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ప్రభాకర్, వరదం వెంకటరమణ, వెంకటేశ్వరరావు, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని లక్కనపల్లి పంచాయతీ వారికి 32ఇంటి పట్టాలు మంజూరైనట్లు ఎంపీపీ రెడ్డెప్ప తెలిపారు. వారికి సోమవారం ఎంపీపీ రెడ్డప్ప, స్థానిక సర్పంచ్ కృష్ణారెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చిన్నసుబ్రహ్మణ్యం, వీఆర్వో వెంకటేష్, ఉపసర్పంచ్ ఈశ్వరమ్మ. మాజీ ఎంపిటిసి వాసు, ప్రభాకర్ రెడ్డి, రఘు రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూముల పరిశీలన

ప్రజాశక్తి-పుంగనూరు: ఎన్నికల విధులు, నిబంధనలు, అనుసరించాల్సి విధివిధానాలపై సోమవారం పుంగనూరులో అధికారులకు కలెక్టర్ షన్మోహన్ దిశానిర్దేశం చేశారు. కాగా పట్టణంలోని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో పుంగనూరు నియోజకవర్గానికి సంబంధించి ఈవియంల భద్రపరచడానికి స్ట్రాంగ్ రూమ్స్, రిసెప్షన్ సెంటర్స్‌ను జేసీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లతో కలిసి పరిశీలించారు.

మాజీ మంత్రిని కలిసిన ప్రసాద్‌రావు



ప్రజాశక్తి-పలమనేరు: మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డిని సోమవారం పలమనేరులో ప్రసాద్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన కు దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్రనాయుడు, బాలాజీ, బ్రహ్మ య్య, కుట్టి, గిరిబాబు, ఖాజా పీర్, నాగరాజు, సోమశేఖరగౌడ్, మాబాషా పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: ఎన్నికల నియమావళిని ప్రింటింగ్ ప్రెస్ నడిపేవారు, ఫ్లెక్సీలు ప్రింట్ చేసేవారు, జెరాక్స్ సెంటర్ నడిపేవారు ఎన్నికల నియమావళికి లోబడి వ్యవహరించాలని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్, తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వారితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో టీపీవో నీరజాక్షి, నగరి ప్రింటర్స్ అసోసియేషన్ సభ్యులు, జెరాక్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

గర్భవతులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని పెద్దఉప్పరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పిఎంఎస్ఎంఎ కార్యక్రమంలో భాగంగా 28మంది గర్భవతులకు వైద్య పరీక్షలను నిర్వహించినట్టు వైద్యాధికారి బాలాజీ తెలిపారు. గర్భవతులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని వైద్యులు వైద్య సిబ్బంది సూచించిన మేరకు జాగ్రత్తలు పాటించాలని క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు తల్లిబిడ్డ ఆరోగ్యంగా ఉండే విధంగా చూడాలని పోషకాహార లోపం వల్ల పిల్లలు అనారోగ్యంతో పాటు బలహీనంగా పుడతారని కావున గర్భవతుల ఆరోగ్యంతో పాటు గర్భంలోని చిన్నారి ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని మరిన్ని సూచనలను వారికి అందజేసినట్లు వైద్యాధికారి తెలిపారు. అనంతరం రక్త పరీక్ష, బిపి, హెచ్ఐవి టెస్ట్ నిర్వహించి అవసరమైన వారికి మందులు మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంతకీ ఈ సార్లు వాస్తారా.. రారా.?

- 12గంటలు అవుతాన్నా కార్యాలయం తెరవరే..
- వెలుగు కార్యాలయం వద్ద అధికారుల కోసం ప్రజలు నిరీక్షణ

ప్రజాశక్తి-బంగారుపాళ్యం:

మండల కేంద్రంలోని మహిళా సమైక్య విభాగ కార్యాలయం సోమవారం మధ్యాహ్నం 12 గంటలు అవుతున్న తెరవలేదు. శుక్ర, శని, ఆదివారాలు మూడు రోజులు సెలవు ఉన్నా సోమవారం ఉదయం కార్యాలయ సమయానికి అధికారులు రాకపోవడం అందుకు నిదర్శనం. ఉదయం 10గంటల నుండి డ్రోక్రా ఆశ్ర నిధులు కోసం పలువురు డ్వాక్రా సభ్యులు కార్యాలయం దగ్గరికి వచ్చి కార్యాలయం తాళం వేసుండడంతో వెనుతిరిగి వెళ్లిపోయారు. మరికొంత మంది అధికారుల కోసం నిరీక్షించారు. ఇకనైనా సంబంధిత అధికారులు సమయపాలన పాటించి తెరవాల్సిన సమయానికి కార్యాలయం తెలిసి డ్రోక్రా సభ్యులకు సకాలంలో పనులను చేపట్టాలని పలువురు కోరారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి మండల అధికారులు తీరుపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



తాళం వేసున్న మహిళ సమాఖ్య కార్యాలయం

ఆర్‌టిసి బస్సుల కొరత

- ఫుట్ బోర్డుపై ప్రయాణం
- నిత్యం ప్రమాదకర స్థితిలో రాకపోకలు
- విద్యార్థులు, ఉపాధ్యాయుల అవస్థలు

ప్రజాశక్తి - బుచ్చినాయుడుకండ్రిగ:

మండల కేంద్రంలోని బుచ్చినాయుడు కండ్రిగ ప్రభుత్వ పాఠశాలలకు నిత్యం 50 నుంచి 60 వరకు ఉపాధ్యా యులు, వివిధ ప్రైవేటు కార్యాలయాలకు వెళ్లేవారు, విద్యార్థులు వందల సంఖ్యలో వుండడంతో ఆర్‌టిసి బస్సులు తగిన సంఖ్యలో లేక వారు ఇబ్బందులకు గురవుతున్నారు. సరైన సమయానికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు విధులకు చేరుకోలేక ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యార్థులు ఉన్న ఒకటి, రెండు బస్సుల్లోనే స్కూలుకు వెళ్లి, సాయంత్రం ఫుట్‌బోర్డు పైనే ప్రయాణించి ఇంటికి చేరుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఆర్‌టిసి అధికారులు వెంటనే స్పందిం చి విద్యార్థులను, ఉపాధ్యాయులు, ఉద్యోగులను దృష్టిలో వుంచుకుని తగిన బస్సు సర్వీసులు ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరించాల్సి వుంది.



బుచ్చినాయుడు కండ్రికకు సత్యవేడు, శ్రీకాళహస్తి , సూళ్లూరు పేట, తిరుపతి డిపోల నుంచి బస్సులు వస్తున్నాయి. ఇవే కాకుండా చెన్నై నుండి కూడా వస్తాయి. ఉదయం స్కూలు ప్రారంభ సమయం ఎనిమిది నుంచి తొమ్మిది గంటలకు, సాయంత్రం వదిలే సమయం నాలుగు నుంచి నాలుగున్నర గంటల మధ్య ఒక్క బస్సు మాత్రమే వస్తోంది. విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో ఉండడంతో వారు ఫుట్ బోర్డు ప్రయాణం చేయాల్సి వస్తోంది. గతంలో ఎన్నోసార్లు డిపో మేనేజర్లకు విన్నవించినా ఫలితం శూన్యమని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. పాఠశాలలు వదిలే సమయానికి ప్రత్యేకంగా ఆర్‌టిసి బస్సు ఏర్పాటు చేయాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరు తున్నారు.

ప్రమాదకర స్థితిలో ప్రయాణం

బుచ్చినాయుడు కండ్రికకు వచ్చే టీచర్స్ 50 నుండి 60 మందికి పైగానే ఉన్నారు. మిగిలిన కార్యాల యాల్లోనూ అధిక సంఖ్యలో ఉండడంతో విద్యార్థులకు ఇబ్బంది కరంగా ఉంటోంది. బస్సు టాప్‌పై, ఫుట్ బోర్డుపై ప్రయాణించాల్సి వస్తోంది. బుచ్చినాయుడు కండ్రిగ లో ప్రైవేటు స్కూళ్లకు సుమారు 350 మంది, ప్రభుత్వ పాఠశాలలకు 400 మంది వరకు విద్యార్థులు ఆర్‌టిసి బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారు. మొత్తం 750 మంది విద్యార్థుల వరకు ఆర్‌టిసి బస్సులను ఆశ్రయి స్తున్నారు. వారందరికీ ఉదయం పాఠశాలలు ప్రారంభ సమయంలోనూ, సాయంత్రం స్కూళ్లు వదిలిన సమయంలోనూ తగినన్ని బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తే ప్రమాదకర పరిస్థితిని అరికట్టవచ్చని స్థానికులు పేర్కొంటున్నారు. ఆర్‌టిసి అధికారులు వెంటనే స్పందించాల్సిన అవసరం వుంది.